క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: యలమంచిలి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, రాంబిల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. యలమంచిలి, ఎర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు కూడా సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి, ఆ సమయంలో అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

గోవిందపాలెంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ట


సీతారామ స్వామి విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం గోవిందపాలెంలోని శ్రీసీతారామ స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ముందుగా విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

395 మందికి నేత్ర పరీక్షలు


బ్రాండిక్స్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అచ్యుతాపురం: మండలంలోని అదీస్తాన్(బ్రాండిక్స్) కంపెనీలో ఆదివారం నిర్వహించిన 136వ కంటి వైద్య శిబిరంలో 395 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 313 మందికి కళ్లద్దాలు అందజేశారు. 123 మందికి పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు అందజేశారు. 50 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని సూచించారు. కంటి శిబిరానికి విచ్చేసిన వారికి మజ్జిగ, ఫలహారం, భోజనం సమకూర్చారు.

మడుతూరులో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం


మడుతూరులో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం: మండలంలోని మడుతూరులో భార్గవి అమోనియం యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి వనరుల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మోటూరు శ్రీవేణి, మాజీ జెడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జి, నానాజీ, రామకృష్ణ, సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యాక్టర్ వాహనం ప్రారంభం

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీలో భవన నిర్మాణం, ఇతర వ్యర్థాల తొలగింపునకు ఉపయోగపడే కంప్యాక్టర్ వాహనాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదివారం సాయంత్రం ఇక్కడ మున్సిపల్ కార్యాలయంలో ప్రారంభించారు. రూ.29 లక్షల సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన 7 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన ఈ వాహనంతో పట్టణానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. వాహనం నిర్వహణపై నిర్లక్ష్యం చూపకుండా ఎక్కువ కాలం పనిచేసేలా చూడాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, ఏఈ గణపతి సుబ్బారావు, మేనేజర్ విజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పలువురు వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ: మంచాల మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రింట్ కాపీతోపాటు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెటు, కుల, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను ఈ నెల 30లోగా పాఠశాలలో అందించాలన్నారు. వచ్చే నెల 20న పాఠశాలలో నిర్వహించే ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి అవకాశం కల్పిస్తామన్నారు.


భక్తుల దర్శనాల కోసం ఏర్పాటు చేసిన క్యూలైను


ఆలయంలో అంకురార్పణ పూజ చేస్తున్న అర్చకులు

వెంకన్న జాతరకు పోదాం చలోచలో..




పూల అలంకరణతో ధ్వజ స్తంభం

నక్కపల్లి: పోదాం పద ఉపమాక వెంకన్న జాతరకు అంటూ భక్త జనం పయనమైంది. సోమవారం ఉపమాకలో జరిగే జాతరలో పాల్గొని వెంకన్న కల్యాణాన్ని తిలకించేందుకు భక్త జనకోటి తరలివస్తోంది. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి నేత్రపర్వంగా జరగనుంది. ఈ వైభోగాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు ఉపమాక తరలివస్తున్నారు. ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ ఏకాదశి నాడు కోనేటి రాయుని కల్యాణం వేదమంత్రోచ్ఛారణల మధ్య జరగనుంది. కల్యాణ వేంకటేశ్వరుడ్ని తిలకించేందుకు ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తారు. వేకువ జాము నుంచే ఉపమాక వెంకన్న ఆలయం భక్తకోటితో కిక్కిరిసిపోతుంది. సంతానం లేని వారు ఇక్కడ ఉన్న ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించి, ఆలింగనం చేసుకునేందుకు పోటీ పడతారు. ఉగాది వరకు ఇక్కడ జాతర(తీర్థం) జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి భక్తులు ఆదివారం సాయంత్రానికే ఉపమాక చేరుకుంటున్నారు. సోమవారం రాత్రి జరిగే స్వామి కల్యాణాన్ని తిలకించి తిరుగు ప్రయాణమవుతారు.

టీటీడీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు

ఉత్సవాలు తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు, షెడ్లు, విద్యుద్దీపాలంకరణలు చేశారు. వారం రోజుల పాటు టీటీడీ అధికారులు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని బృందాలు ఇక్కడ కోలాటం నిర్వహించేందుకు తమ పేర్లు నమోదు చేయించుకున్నాయి. ఉపమాక పరిసర ప్రాంతాల నుంచి తప్పెటగుళ్లు, తోడపెద్దు సంబరాలు నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలు వస్తున్నాయి. సోమవారం ఉదయం ప్రారంభమయ్యే జాతర మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగుతుంది. భక్తులకు వివిధ సేవా సంఘాల సభ్యులు ప్రత్యేక అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. నక్కపల్లి సత్య సాయి సేవా సమితి సభ్యులు భక్తులకు మంచినీరు ,మజ్జిగ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. హెటిరో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించనున్నారు.


భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత

కల్యాణ కట్ట వద్ద ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు

తలనీలాలు సమర్పించే భక్తుల కోసం ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు నిర్మించారు. రూ.10 టికెట్ తీసుకుని తలనీలాలు సమర్పించుకోవాల్సి ఉంటుంది. వృద్ధులు, చంటి పిల్లల కోసం ఉచితంగా పాలు సరఫరా చేయనున్నారు. తిరుపతి లడ్డూలు విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాల సాయంతో బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు.

జల్లికట్టు స్నానానికి ఏర్పాట్లు..

బందుర సరస్సు వద్ద స్నానఘట్టాలు, మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. స్వామివారి పుష్కరిణిలో జల్లికట్టు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులు చెరువులోపలికి వెళ్లకుండా 50 అడుగుల మేర రేకుతో ఫెన్సింగ్ అమర్చారు. ఈ మధ్యలోనే భక్తులు స్నానాలు చేసేందుకు షవర్లు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం నుంచే జల్లికట్టు స్నానం చేసేలా చర్యలు తీసుకున్నారు.

పటిష్ట బందోబస్తు

ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. హోంమంత్రి అనిత, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వేర్వేరుగా వచ్చి ఏర్పాట్లపై ఆదివారం సమీక్ష జరిపారు. నక్కపల్లి, అడ్డురోడ్డు, పాయకరావుపేట సీఐల ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మఫ్టీలో కూడా పోలీసులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే.!


రామన్నపాలెం శివారున పేరుకుపోయిన చెత్త

కోటవురట్ల: పల్లెల్లో పారిశుధ్యం లోపించింది. రహదారులు, వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నప్పటికీ వినియోగంలో లేకపోవడంతో గ్రామంలోని చెత్తను తీసుకెళ్లి రహదారుల వెంబడి పోగుచేస్తున్నారు. పలు గ్రామాలలో నెలల తరబడి చెత్తను తొలగించకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు ముసురుకుంటున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, చెత్త పేరుకుపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. డ్రైనేజీలలో కూడా పూడికలు తీయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండు గ్రామాల్లో నవోదయం 2.0


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ ప్రసాద్

మాడుగుల: మండలంలో గొప్పులుపాలెం, కొండలపాడు గ్రామాల్లో నవోదయ 2.0 అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా ప్రొహిబిషన్ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. సారా సంబంధిత ఫిర్యాదులు 14401 టోల్ ఫ్రీ నంబరుకు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన గ్రామాలు ప్రజలు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటికొప్పాక బొమ్మల స్టాల్ సందర్శన


కేంద్ర టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కమిషనర్ బీనాకు లక్కబొమ్మను అందిస్తున్న కళాకారుడు శరత్

యలమంచిలి రూరల్: అమత్ మహోత్సవాల్లో భాగంగా రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శనకు ఏర్పాటు చేసిన ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్‌ను కేంద్ర టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ ఎం.బీనా ఆదివారం సందర్శించారు. చివరి రోజు ప్రదర్శనలో పలువురు కేంద్ర అధికారులు, ప్రజా ప్రతినిధులు లక్కబొమ్మలను చూసి ప్రశంసించారని స్టాల్ ఏర్పాటు చేసిన కళాకారుడు పెదపాటి సత్యనారాయణ శరత్ ఆదివారం రాత్రి స్థానిక విలేకరులకు తెలిపారు. లక్కబొమ్మల తయారీ విధానం గురించి ఆసక్తిగా తెలుసుకోవడంతో పాటు ఇక్కడ హస్తకళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కమిషనర్ బీనాకు వివరించినట్టు శరత్ తెలిపారు. ముఖ్యంగా ఉత్పత్తి అవుతున్న లక్కబొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం, సరికొత్త డిజైన్ల తయారీపై కళాకారులకు శిక్షణ ఇప్పించాలని అధికారులను కోరినట్టు చెప్పారు.

ఆకట్టుకున్న గుర్రాల పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

మాడుగుల: మండలంలో ఒమ్మలి చెరుకు తూనిక కేంద్రం వద్ద వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలలో నిర్వహించిన రేస్ గుర్రాల పరుగు పందేలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చుట్టు పక్కల గ్రామాలు నుంచి వచ్చిన ప్రజలు వీటిని ఆసక్తిగా తిలకించారు. అదేవిధంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం నేల వేషాలు, శక్తి వేషాలు ప్రదర్శించారు.

వైభవంగా మోదకొండమ్మ పండగ


హుషారుగా దౌడు తీస్తున్న ఎడ్లు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో మోదకొండమ్మ పండగను గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులంతా గ్రామ పొలిమేరలో ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయింత్రం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందెం ఆకట్టుకుంది. విజేతలకు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. రాత్రికి భారీ మందుగుండు సామగ్రి కాల్పులు, డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారి సంబరం సాగింది. మంగళాపురం, కుముదాంపేట, సురవరం, వడ్డాది తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్


రేబాకలో ఉపాధి కూలీల మస్టర్ వివరాలను తనిఖీ చేస్తున్న సోషల్ ఆడిట్ బృందం

తుమ్మపాల: ఉపాధి హామీ పథకం 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టిన పనులపై రెండు రోజులుగా సోషల్ ఆడిట్ తనిఖీలు జరుగుతున్నాయి. మండలంలో ఈ నెల 7న మొదలైన తనిఖీలు 17వ తేదీ వరకు కొనసాగనున్నాయి. గ్రామాల్లో చేపట్టిన పనుల జాబితాతో పాటు కూలీల వివరాల ఆధారంగా సోషల్ ఆడిట్ బృందాలు గ్రామాల్లో పూర్తి చేసిన పనులను పరిశీలించి లెక్కలు కడుతున్నారు. దీంతో పాటు గడపగడపకు తిరిగి కూలీల నుంచి మస్టర్ వివరాలు సేకరిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వస్తున్న సమస్యలతో పాటు మస్టర్ల నమోదు, వేతనం చెల్లింపుల్లో వసూళ్లపై కూడా ఆరా తీస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్ల జాబితాల్లో అవకతవకలకు పాల్పడినట్టు, పనికి రాకుండానే వారి కుటుంబీకుల పేర్లను మస్టర్లలో నమోదు చేసి వేతనాలు పొందినట్లు వస్తున్న ఫిర్యాదులను కూడా పరిగణనలోకి తీసుకుని తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలో సీతానగరం, రొంగళివానిపాలెం, కుంచంగి, దిబ్బపాలెం, ఊడేరు గ్రామాల్లో గ్రామసభలు పూర్తవగా, వెంకుపాలెం, మాకవరం, చింతనిప్పుల అగ్రహారం, గోపాలపురం, సుందరయ్యపేట, కూండ్రం, బవులువాడ, తదితర గ్రామాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి


వాసవీక్లబ్ జోన్ చైర్మన్ పుట్టా మాధవిని సన్మానిస్తున్న వాసవీ క్లబ్ మహిళలు

మాడుగుల రూరల్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ పుట్టా మాధవి అన్నారు. జంపెన వాసవీమాత ఆలయం వద్ద కింతలి-గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అనపగడ్డ అనిత, కె. లక్ష్మి, పి. రూప, కె. అశ్వినిలను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ వృత్తి, ఉపాధితో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చీడికాడ జోన్ చైర్మన్ శ్రీనాథు అప్పారావు, వాసవీక్లబ్ జిల్లా అధికారులు శ్రీనాథు కన్నయ్యశెట్టి, అనపగడ్డ హరినాథబాబా, నాచు గున్నయ్యశెట్టి, క్లబ్ ప్రతినిధులు రావాల సతీష్, పుట్టా ప్రకాష్, పుట్టా కొండలరావు పాల్గొనారు.

సీతారాముల రథం తయారీకి శ్రీకారం


సీతారాముల రథం చెక్కకు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంపొందించుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక పంచాయతీ వీధిలోని రామాలయంలో సీతారాముల ఊరేగింపునకు అవసరమైన రథం తయారీకి సంబంధించిన పనులకు ఆదివారం ఆయన శ్రీకారం చుట్టారు. రథం చెక్కకు వేద పండితులు రేజేటి సత్యనారాయణ మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు అవకాశం ఉన్నంతలో దేవాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. రథం తయారీకి విలువైన చెక్కను సమకూర్చిన టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల నాగప్పారావుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ సభ్యులు పొలిమేర కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, జల్లేపల్లి కిష్టప్ప, వెలగా రామకృష్ణ, సూరిశెట్టి ప్రసాద్, పూసర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లి అమ్మవారు


అన్న సమారాధనకు హాజరైన భక్తులు

మునగపాక: స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అధిక సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రామాలయం నిర్మాణానికి విరాళం


దళితవాడ రామాలయం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రామ్మోహనరావు దంపతులు

మునగపాక: స్థానిక దళితవాడలో నిర్మిస్తున్న రామాలయానికి భక్తులు తనవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఈ నెల 15న ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మూడు రోజుల పాటు వేడుకగా ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. మునగపాకకు చెందిన పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, కనకరత్నం దంపతులు రూ.1,00,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పిల్లి అప్పారావు, డొక్కా నాగభూషణం, దిమ్మల నూకరాజు, బీలా లక్ష్మణరావు, తంబార్కి సాంబశివ, కరణం గణేష్, అనిల్‌కుమార్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్


ఎడ్యుకేషనల్ సైకాలజిస్టు రావును సత్కరిస్తున్న తోసా సభ్యులు

మునగపాక: లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ప్రముఖ ఎడ్యుకేషనల్ సైకాలజిస్టు జేపీసీ రావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట హైస్కూల్‌లో ఆదివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పోటీపరీక్షల్లో పాల్గొనడం ద్వారా మనలో ఉన్న భయం పోతుందన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే రాణించగలమన్నారు. తల్లితండ్రులు కూడా పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భీమిశెట్టి ఉమాశంకర్, శరగడం వెంకట రెడ్డి నాయుడు, మళ్ల అప్పలనాయుడు, నాగ మాణిక్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సైకాలజిస్టు రావును ఘనంగా సత్కరించారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి


సరుగుడు జలపాతం

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాట ఆడుతూ సేద తీరారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ద్విచక్ర వాహనాలు, కార్లు అధిక సంఖ్యలో రావడంతో సరుగుడు మార్గంలో రద్దీ నెలకొంది.

నేటి నుంచి లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవాలు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో పురాతన లక్ష్మీ నారాయణ స్వామివారి దేవాలయం 35వ వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు ఏపీ సాధు సంపత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామిజీ ప్రవచనాలు, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. కల్యాణోత్సవం, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఏపీ సీఆర్పీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా 'సబ్బవరపు'


నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న సీఆర్పీ సభ్యులు

అనకాపల్లి టౌన్: ఏపీ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా సబ్బవరపు శంకరరావు ఎన్నికయ్యారు. స్థానిక కృష్ణవేణి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గౌరవ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సీఆర్పీ సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికైంది. మండలం గౌరవ అధ్యక్షుడిగా శ్యామ్, అధ్యక్షుడిగా ఎస్.శంకరరావు, జనరల్ సెక్రటరీగా చిరంజీవి, కోశాధికారిగా మూర్తి, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, కన్వీనర్‌గా రమణ, కో కన్వీనర్‌గా గంగాధర్‌రావు, రావికమతం మండల కన్వీనర్‌గా రమణ, సబ్బవరం మండలం ఉమెన్స్ సెక్రటరీగా ఎం.వి.ఎస్.ఎస్.పద్మజ, సబ్బవరం మండలం లీగల్ అడ్వైజర్‌గా సతీష్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పీఏబీ ప్రకారం వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్, హెచ్ఆర్‌సీ పాలసీ అమలు, తదితర అంశాలను సాధించే దిశగా నూతన కమిటీ ప్రయత్నం చేయాలన్నారు.